సాక్షి
నిజామాబాద్

శనివారం । 23 । నవంబర్ । 2024



కొనుగోళ్లు పూర్తి చేయాలి

ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸



డాటాలో తప్పులు రావొద్దు

సమగ్ర సర్వే డాటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా ఎన్యుమరేటర్లకు నమోదు బాధ్యతలు అప్పగించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /12.6

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించాలి



కమ్మర్‌పల్లి: ఉపాధ్యాయులు బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగించి విద్యార్థులను ఆకట్టుకునేలా పాఠాలు చెప్పాలని డీఈవో అశోక్ సూచించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డీఈవో సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులను నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్)కు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం కమ్మర్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రత్యేకాధికారి గంగమణితో మాట్లాడారు. ఎంఈవో ఆంధ్రయ్య, హెచ్‌ఎంలు రాజన్న, గిరిధర్ పాల్గొన్నారు.

సీడీఎంఏకు మున్సిపల్ మేనేజర్ సరెండర్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న హయ్యూమ్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు సీడీఎంఏ కార్యాలయానికి సరెండర్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, మేనేజర్ మధ్య వాగ్వాదం జరిగింది. ఓ కౌన్సిలర్ జోక్యం చేసుకొని ఇరువురిని సముదాయించారు. పై అధికారితో అనుచితంగా ప్రవర్తించడంతో సీడీఎంఏకు సరెండర్ చేశానని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

డాటా ఎంట్రీ సక్రమంగా చేపట్టాలి



నందిపేట్: ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో డాటా ఎంట్రీ చేపడుతున్న తీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. నిబంధనలను పక్కాగా పాటిస్తూ, అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ సందర్భంగా సూచించిన అంశాలను తప్పకుండా పాటించాలన్నారు. పొరపాట్లు, తప్పిదాలకు ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ ఆనంద్, ఎంపీడీవో శ్రీనివాసరావు ఉన్నారు.



సుభాష్‌నగర్ రామాలయం గర్భగుడిలో బంగారు వెండి రామబాణం, ధనుస్సు

రామబాణం.. ధనుస్సు



కిలో బంగారం, 13 కిలోల వెండితో తయారు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అయోధ్య పుణ్యభూమిలో అయోధ్య–భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ ద్వారా గత ఏడాదిన్నరగా ప్రతిరోజూ అన్నదానం చేస్తూ.. బాలరాముడి సేవలో తరిస్తున్న జిల్లా వాసి దేశ వ్యాప్తంగా ప్రధాన ఆలయాల పర్యటన చేస్తున్నారు. జిల్లాకు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి అనే భక్తుడు 1 కిలో బంగారం, 13 కిలోల వెండితో చెన్నైలో తయారు చేయించిన రామబాణం, ధనుస్సును దేశంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో, మఠాల్లో, పీఠాల్లో ఉంచి ప్రధాన అర్చకులు, మఠాధిపతులు, పీఠాధిపతులతో ప్రత్యేకమైన పూజలు చేయిస్తున్నారు. ఈ ధనుస్సు, బాణాన్ని 2025 ఏప్రిల్ 6న అయోధ్య బాలరాముడి ఆలయానికి అప్పగించనున్నారు. రాముడి 14 సంవత్సరాల వనవాసానికి గుర్తుగా 14 కిలోల ధనుస్సు, బాణం తయారు చేయించినట్లు శ్రీనివాస శాస్త్రి చెబుతున్నారు. శుక్రవారం ఇందూరు నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సరళ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీటిని ఉంచి పూజలు చేశారు. భక్తులు దర్శించుకున్నారు.

- సుభాష్‌నగర్ రామాలయంలో దర్శించుకున్న భక్తులు
- రామబాణం, ధనుస్సుతో దేశవ్యాప్తంగా జిల్లా భక్తుడి యాత్ర
- 2025 ఏప్రిల్ 6న అయోధ్య ఆలయానికి అప్పగించనున్న శ్రీనివాస శాస్త్రి
- గతంలో పాదుకలతో రామేశ్వరం నుంచి అయోధ్య వరకు పాదయాత్ర

అయోధ్యలో భారీ ఆలయం..

అయోధ్య నగరంలో అయోధ్య–భాగ్యనగర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాముడు పుట్టిన సూర్య వంశం (బ్రహ్మ నుంచి మొదలు), సీతామాతకు చెందిన చంద్ర వంశం పురుషులతో, అదేవిధంగా సప్తరుషుల విగ్రహాలతో మొత్తం 400 పైగా విగ్రహాలు ఏర్పాటు చేసేలా ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు గాను రాముడు అయోధ్య నుంచి వనవాసం కోసం బయటకు వచ్చిన ప్రాంతంలో 5 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. తమిళనాడులోని మహాబలిపురంలో విగ్రహాలు తయారు చేయిస్తున్నారు. ఇప్పటికే 50 పైగా విగ్రహాలు తయారైనట్లు శ్రీనివాస శాస్త్రి తెలిపారు.

■ శ్రీనివాస శాస్త్రి గతంలో 1 కిలో బంగారం, 8 కిలోల వెండితో శ్రీరాముడి పాదుకలను హైదరాబాద్‌లో తయారు చేయించారు. (వెండి పాదుకలకు బంగారు తొడుగు ఉంచుతారు). వెండి పాదుకలను శిరస్సుపై పెట్టుకుని శ్రీనివాస శాస్త్రి అయోధ్యలో 41 రోజుల పాటు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తర్వాత ప్రతి నెల 15 రోజుల పాటు ఈ పాదుకలతో దేశవ్యాప్తంగా పర్యటించారు. ఈ క్రమంలో దేశంలోని అన్ని పుణ్యనదుల్లో పాదుకలకు స్నానం చేయించారు. అదేవిధంగా శృంగేరి, కంచి, తిరుమల, పుష్పగిరి, ఉడిపి, పూరి, మైసూరు గణపతి సచ్చిదానంద, జీయరుస్వామి పీఠాల్లో పాదుకలకు ప్రత్యేకంగా ఆయా పీఠాధిపతులు పూజలు చేశారు.

ఈ క్రమంలో శ్రీనివాస శాస్త్రి రామేశ్వరం నుంచి అయోధ్య వరకు త్రేతాయుగంలో 'శ్రీరాముడు నడయాడిన' దారిలో (రామేశ్వరం-కిష్కింధ(కర్ణాటకలోని రుష్యమూక పర్వతం -భద్రాచలం-కందకుర్తి-బాసర-మహోర్‌గఢ్-ఉన్కేశ్వర్-చిత్రకూట్ (మధ్యప్రదేశ్) మీదుగా అయోధ్యకు పాదుకలతో పాదయాత్ర చేశారు.

■ శ్రీనివాస శాస్త్రి తయారు చేయించిన 5 వెండి ఇటుకలనే ఆయల శంకుస్థాపనకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉపయోగించడం విశేషం. ఒక్కో ఇటుకను 2.5 కిలోల వెండితో తయారు చేశారు. 2019లో రామజన్మభూమి విషయమై సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక అయోధ్య రాజకుటుంబీకుడు బిమలేంద్రసింగ్ మిశ్రా సమక్షంలో అయోధ్య కలెక్టర్‌కు మొదటి ఇటుకను అందజేశారు. తరువాత 2020 ఆగస్టు 2వ తేదీన మిగిలిన 4 ఇటుకలను తయారు చేశారు.



ధనుస్సుకు కంచి పీఠాధిపతి పూజలు



ధనుస్సుకు శృంగేరి పీఠాధిపతి పూజలు



అయోధ్యలో అన్నదానం చేస్తున్న దృశ్యం

రైతుల్లో బోనస్ సంబరం

- బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న సర్కారు
- జిల్లాలో 3,223 మందికి లబ్ధి
- సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు



డొంకేశ్వర్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు, రైతుల పాలాభిషేకం

డొంకేశ్వర్(ఆర్మూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీని నెర వేరుస్తోంది. క్వింటాల్‌కు రూ.500 చొప్పున సన్న వడ్లకు బోనస్ అందజేస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతున్నాయి. సెల్‌ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు రావడంతో ప్రభుత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ వాట్సప్ స్టేటస్‌లు పెడుతున్నారు. ఈ మేరకు జిల్లాలో 3,223 మంది రైతులు లబ్ధి పొందగా, వీరికి రూ.12.54 కోట్లు విడుదలయ్యాయి. దీంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులతో పాటు రైతులు మండల కేంద్రాల్లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. మూడు నెలల క్రితం రుణమాఫీ, ఇప్పుడు బోనస్ అందజేయడంతో కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేసింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులంతా సన్నాలే సాగు చేయడంతో 80 శాతం మంది బోనస్‌ను అందుకోనున్నారు. ఇటు పంటను విక్రయించిన డబ్బులతో పాటు బోనస్ రావడంతో ఆదాయం రెట్టింపయ్యిందని రైతులు అంటున్నారు. ఇటు పొలాలు కౌలుకు తీసుకున్న రైతులకు కూడా లాభం జరిగింది.

ఖాతాలో రూ.1లక్షా 10 వేలు పడ్డాయి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 221 క్వింటాళ్ల సన్న వడ్లు అమ్మిన. పంట అమ్మిన డబ్బులతో పాటు క్వింటాల్‌కు రూ.500 చొప్పున మొత్తం రూ.1,10,500 ఖాతాలో పడ్డాయి. బోనస్ డబ్బులు ప్రభుత్వం ఇంత త్వరగా ఇస్తుందని అనుకోలేదు. చాలా సంతోషంగా ఉంది.

– దడిగె పెంటన్న, డొంకేశ్వర్

మొన్న రుణమాఫీ, ఇప్పుడు బోనస్



మూడు నెలల క్రితమే నాకు లక్షన్నర పంట రుణమాఫీ జరిగింది. ఇప్పుడు 186 క్వింటాళ్ల సన్న వడ్లు అమ్మితే రూ.93 వేలు బోనస్ బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేస్తోంది. గత ప్రభుత్వం నాకు రుణమాఫీ కూడా చేయలేదు. ఇప్పుడు రుణమాఫీ, బోనస్ ఇచ్చినందుకు కాంగ్రెస్ సర్కారుకు ధన్యవాదాలు.

– గజ్జెల రవీందర్, డొంకేశ్వర్

కాలభైరవుడికి లక్ష దీపార్చన



లక్ష దీపార్చనలో పాల్గొన్న భక్తులు

రామారెడ్డి : ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీకాలభైరవుడి జన్మదిన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. 72 గంటల సంతత ధారాభిషేకం కొనసాగింది. సాయంత్రం 6 గంటలకు లక్ష దీపార్చన ప్రారంభమైంది. ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకుడు శ్రీనివాసశర్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయానికి దీప శోభ తెచ్చారు. భైరవ నామస్మరణతో ఆలయం మారుమోగింది.



లక్షదీపార్చనను ప్రారంభిస్తున్న ఆలయ ఈవో ప్రభుగుప్తా

భూ వివాదాలు @ నాగారం

- ప్రభుత్వ భూములు అధికంగా ఉండటంతో కబ్జాదారుల కన్ను
- పోలీసు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆక్రమణలు
- నకిలీ పట్టాల విషయంలో ఇప్పటికే రెండు కేసులు నమోదు



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని నాగారం భూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. నాగారంలో ఎక్కువగా ప్రభుత్వ ఉండటంతో గతంలో ప్రభుత్వం పేదలకు 70 నుంచి 85 గజాల ఇంటి స్థలాలను అందజేసింది. దీనిని ఆసరా చేసుకున్న ముఠాలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఇంటి స్థలాలను ఏరియాను బట్టి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు విక్రయించారు. ఈ తతంగం దశాబ్ద కాలంగా కొనసాగుతున్న రెవెన్యూ, పోలీసులు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా పలువురి లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసిన స్థలాలను కూడా కబ్జా చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తే వారు సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. సెటిల్‌మెంట్లు చేసుకోకుంటే దాడులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి.

తహసీల్దార్ కార్యాలయం కాలిపోవడంతో..

నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ వద్ద ఉండే సౌత్ తహసీల్దార్ ఆఫీస్ కాలిపోవడంతో ప్రభుత్వ భూములను కబ్జా చేసేవారికి అడ్డూ లేకుండా పోయింది. ఆ సమయంలో రికార్డులు, ప్లాట్లు పంపిణీ చేసిన లబ్ధిదారులు వివరాలు కాలిపోయాయి. దీంతో రెవెన్యూ అధికారులు ప్లాట్ల కబ్జాపై ఎవరైనా ఆశ్రయిస్తే రికార్డులు కాలిపోవడంతో వివరాలు లేవని చెబుతున్నారు. అయితే వీటికి సంబంధించిన వివరాలు ఆర్డీవో, అదనపు కలెక్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి. అయినా అక్కడి నుంచి సమాచారం తెప్పించుకోకుండా అక్రమార్కులు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేసి విక్రయిస్తున్నారు. ఈ ముఠాల వెనుక రాజకీయ నేతల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

నకిలీ పట్టాలు సృష్టించి..

ప్రభుత్వ భూములను ఆక్రమించి నకిలీ పట్టాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. నకిలీ పట్టాల కోసం గతంలో ఉన్న రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ప్రహరీలు నిర్మించారు. వాటికి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇంటి నంబర్లు కూడా తీసుకున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

పోలీసులకు ఫిర్యాదు చేసినా!

ఇంటి స్థలాలు ఆక్రమించారని బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు రెవెన్యూ అధికారులకు లెటర్ పెడుతున్నారు. దీంతో దీంతో రెవెన్యూ అధికారులు దీనికి సంబంధించిన వివరాలు లేవని మళ్లీ పోలీసులకు సమాచారం ఇచ్చిన ఘటనలు ఉన్నాయి. పోలీసులు లెటర్ పెట్టగానే రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేసి రెవెన్యూ, పోలీసులను మేనేజ్ చేస్తున్నారు. లబ్ధిదారులను ముఠా సభ్యులు బెదిరించడంతో చాలా మంది ఇంటి స్థలాలను వదిలేసుకున్నాడు. కాగా ఈ ముఠా సభ్యులు అధికారులను మేనేజ్ చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం ఓ పోలీస్ అధికారి జన్మదిన వేడుకలను ఈ ముఠా సభ్యులు నిర్మల్ జిల్లాలో ఘనంగా జరిపినట్లు ప్రచారం ఉంది.

నాగారంలో పలు వివాదాలు

- నాగారంలోని తన ఇంటి స్థలాన్ని ఆక్రమించారని మేయర్ భర్త శేఖర్‌పై సోమవారం రసూల్ అనే వ్యక్తి దాడి చేశాడు.
- ఇటీవల నాగారంలోని భారతీరాణి కాలనీలో గల బొందెం చెరువు శిఖం భూమిని ముఠా సభ్యులు ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఫిర్యాదులు రావడంతో పోలీసుల బందోబస్తుతో శిఖం భూమిలో ఉన్న ఇళ్లను అధికారులు కూల్చివేశారు. ఇందులో 11 మందిపై కేసు నమోదు అయింది.
- ఏడాదిన్నర క్రితం అక్రమ పట్టాలపై అప్పటి సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు.
- రెండేళ్ల క్రితం సాయినగర్‌లోని ఓ స్థల వివాదంలో అప్పటి అధికార పార్టీకి చెందిన నేతలు దాడికి పాల్పడ్డారు.

డీసీఈబీ అవినీతి మయం

- ప్రశ్నపత్రాల తయారీలో తప్పుడు బిల్లులు
- సొంతంగా ప్రశ్నపత్రాలు తయారు చేసుకుంటున్న ప్రైవేటు పాఠశాలలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు..



డీసీఈబీ కార్యాలయంలో కుప్పలుగా పడవేసిన ప్రశ్నపత్రాలు



శంకర్‌భవన్ పాఠశాలలోని డీసీఈబీ కార్యాలయం

నిజామాబాద్ అర్బన్: జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం (డీసీఈబీ) అవినీతి మయంగా మారింది. విద్యార్థులకు ప్రశ్నపత్రాల తయారీ, మెరుగైన ఫలితాలు తీసుకు రావడంలో కీలకపాత్ర వహించే ఈ విభాగంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించక పోవడంతో ఈ విభాగం దారి తప్పింది. ప్రశ్నపత్రాల తయారీ, ప్రైవేటు పాఠశాలలకు అందించడంలో నిర్లక్ష్యం చోటు చేసుకుంది. తప్పుడు బిల్లులు సైతం లేపుకుంటున్నట్లు తెలుస్తోంది.

■ సమ్మేటీవ్–1, సమ్మేటీవ్–2 పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరికీ డీసీఈబీ రూపొందించిన ప్రశ్న పత్రాలను అందించాలి. విద్యార్థులకు డీసీఈబీ రూపొందించిన ప్రశ్నావళితోనే సమ్మేటీవ్ పరీక్షలు నిర్వహించాలి. అయితే ప్రైవేటు పాఠశాలల్లో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సొంతంగా తయారు చేసిన ప్రశ్నవళితోనే సమ్మేటీవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. కాగా, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలుకుతున్నారు. డీసీఈబీ రూపొందించిన ప్రశ్నపత్రాలను నామమాత్రంగా ప్రైవేటు పాఠశాలలకు అందిస్తున్నారు. అధికారులు ఈ సందర్భంగా ప్రశ్న ప్రతాల ముద్రణ తక్కువ కాపీలు చేయిస్తున్నారు. బిల్లులు మాత్రం ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరికీ ప్రశ్న పత్రాలు అందించినట్లు రూపొందించి క్లెయిమ్ చేసుకుంటున్నారు. ఇటీవల డీసీఈబీ అధికారి ఒకరు రూ. 8 లక్షల బిల్లులు లేపుకున్నట్లు సమాచారం. అదేవిధంగా ప్రశ్న పత్రాల తయారీ కోసం డీసీఈబీకి ప్రతి ఏటా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల బడ్జెట్ మంజూరు అవుతుండగా, తప్పుడు బిల్లులతో నిధులు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 1234 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో లక్ష 48 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల సంఖ్య లక్ష 20 వేల 863 వరకు ఉంటుంది. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సమ్మేటీవ్–1, సమ్మేటీవ్–2 , ఫార్మట్ పరీక్షలను నిర్వహించేందుకుగాను ప్రశ్న పత్రాల తయారు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ప్రశ్న పత్రాలను ఈ విభాగం నుంచే పంపిణీ చేస్తారు. వీరు తయారు చేసిన ప్రశ్న పత్రాల ఆధారంగానే పరీక్షల నిర్వహణ ఉంటుంది. ఇందుకు గాను ప్రభుత్వ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులు ఒక్కొక్కరికి నుంచి రూ.100, 9వ తరగతి విద్యార్థుల నుంచి రూ.90 చొప్పు వసూలు చేస్తారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థుల నుంచి రూ.100 చొప్పున , 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల నుంచి రూ.60 చొప్పున వసూలు చేస్తారు. ఈ బడ్జెట్‌తో ప్రశ్నపత్రాలు తయారు చేసి పరీక్షల నిర్వహణకు అందిస్తారు. అయితే ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగడం లేదు.

అక్రమాలపై విచారణ జరపాలి

డీసీఈబీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరపాలి. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి ప్రశ్నపత్రాలు అందించకపోవడం సమంజసం కాదు. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించాలి

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం

జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.అక్రమాలు జరిగినట్లయితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ప్రశ్నపత్రాల తయారీ, పంపిణీకి సంబంధించి పూర్తి స్థాయి విచారణ చేపడుతాం. ఎలాంటి అక్రమాలు జరుగకుండ చర్యలు తీసుకుంటాము.

– అశోక్, డీఈవో

క్లుప్తంగా

శిశుగృహకు పసికందు అప్పగింత



నవీపేట: మండలంలోని అంజుమాన్ ఫారమ్ గ్రామానికి చెందిన మహిళ దగ్గర అనుమానాస్పదంగా కనిపించిన రెండు నెలల పసికందును ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం శిశుగృహకు అప్పగించారు. గ్రామానికి చెందిన శారదకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరితో పాటు బుధవారం నుంచి రెండు నెలల పసికందు కనిపించింది. అనుమానం వచ్చిన అంగన్‌వాడీ టీచర్ స్వప్న పాప గురించి వాకబు చేయగా పొంతన లేని సమాధానాలు చెప్పింది. దీంతో ఆమె సమాచారం మేరకు ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు పసికందును స్వాధీనం చేసుకొని శిశుగృహకు అప్పగించారు.

వేతనాలు చెల్లించాలని వినతి



సుభాష్‌నగర్: మండలంలోని గ్రామ పంచాయతీ కారోబార్లు, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని కారోబార్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇటీవల ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. ఇతర ఖర్చుల కింద వాడుకున్నారని డీపీవో దృష్టికి తెచ్చారు. డీటీఓలో చెక్కులు జమ చేశారని చెప్తున్నా.. ఇప్పటివరకూ క్లియరెన్స్ కాలేవని, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నామని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి తమకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కారోబార్లు అరుణ్, శ్రీనివాస్, సావిత్రి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

1న మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనునాయక్, కార్యదర్శి బద్దం గోపిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మెన్, ఉమెన్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 30 ఏళ్ల నుంచి 80 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. 100 మీటర్ల రన్నింగ్, 200 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, 5 కిలో మీటర్ల రన్నింగ్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 ఉంటుందని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్ కుమార్(9440007576), జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి (9949585065)ని సంప్రదించాలని సూచించారు.

డాటాలో తప్పులు రావొద్దు

- సర్వే ఆన్‌లైన్ నమోదు బాధ్యత ఎన్యుమరేటర్లకు..
- ఆపరేటర్లతో డాటా ఎంట్రీ చేయించాలని ఆదేశం
- జిల్లాలో ప్రారంభమైన సర్వే వివరాల నమోదు



మోర్తాడ్‌లో సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు, పక్కన కూర్చున్న ఎన్యుమరేటర్లు

మోర్తాడ్(బాల్కొండ): సమగ్ర సర్వే వివరాలను నమోదు చేసిన ఎన్యుమరేటర్లే కంప్యూటర్ ఆపరేటర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లకు ఆయా శాఖల ఉన్నతాధికారుల నుంచి సందేశాలు అందాయి. శుక్రవారం మండల కార్యాలయాల్లో సమగ్ర సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఆరంభమైంది. మండల పరిషత్, రెవెన్యూ, మండల సమాఖ్య కార్యాలయాలు ఇలా అన్ని శాఖల కార్యాలయాల్లో ఉన్న ఆపరేటర్లతో సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును ప్రారంభించారు. కార్యాలయాలతో పాటు అందుబాటులో ఉన్న డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోను ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలంలో 40 నుంచి 80 మంది వరకు ఆపరేటర్లతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మొదలైంది. రెవెన్యూ డివిజన్‌ల వారిగా ఎంపీడీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగింది. మండల పరిషత్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు, రెవెన్యూ, సెర్ప్, గ్రామ పంచాయతీల ఆపరేటర్లతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారిని డాటా ఎంట్రీ కోసం విధుల్లోకి తీసుకున్నారు. జిల్లాలో 4,69,988 కుటుంబాలు ఉండగా వీరి వివరాల నమోదుకు 3,453 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. జిల్లాలో దాదాపు సర్వే పూర్తి అయ్యింది. ఎన్యుమరేటర్లు ఇళ్లకు వెళ్లిన సమయంలో కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో కొంత మంది సర్వే నమోదు పెండింగ్‌లో ఉంది. సర్వేలో వివరాలు నమోదు చేయించుకోని కుటుంబాల వారు గ్రామ పంచాయతీలో తమ వివరాలను అందించాలని గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇప్పటికే సేకరించిన సర్వే వివరాలను ఈనెలాఖరులోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఎస్ఈఈపీసీ సర్వే అనే సాఫ్ట్‌వేర్‌లో డాటా ఎంట్రీని నిర్వహించనున్నారు. ఒక్కో ఆపరేటర్ రోజుకు కనీసం 25 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. తొమ్మిది రోజుల్లో సర్వే వివరాల నమోదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సర్వే వివరాలను నమోదు చేసిన ఉద్యోగులే డాటా ఎంట్రీ చేయిస్తే తప్పులు దొర్లకుండా ఉంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఏర్పాట్లు చేశాం

సమగ్ర సర్వే వివరాల డాటా ఎంట్రీకి ఏర్పాట్లు చేశాం. అందుబాటులో ఉన్న ఆపరేటర్లతో పాటు బయటవారిని నియమించి డాటా ఎంట్రీ ప్రాంభించాం.మోర్తాడ్ డిగ్రీ కళా శాలలో కూడా డాటా ఎంట్రీకి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆపరేట్లకు శిక్షణ ఇచ్చారు. ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేస్తాం. – తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి



డొంకేశ్వర్‌లో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

డొంకేశ్వర్/నందిపేట: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. డొంకేశ్వర్, నందిపేటలో కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. కాంటా వేసే సమయంలో ఎంత ధాన్యం తూకం వేస్తున్నారు, మిల్లులకు తరలిస్తే తరుగు తీస్తున్నారా అని రైతులను అడిగారు. జిల్లాలో 670 పైచిలుకు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 3.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. డిసెంబర్ మొదటి వారం వరకు కొనుగోళ్లు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ధాన్యం రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేవని, లోడింగ్ అన్ లోడింగ్ సజావుగానే జరుగుతోందన్నారు. కేంద్రాల రైతులు నిరీక్షించకుండా క్రమ పద్ధతిలో ధాన్యం బస్తాలను తూకం జరిపించాలని, వెంటవెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సన్న ధాన్యానికి సంబంధించి సంపూర్ణ వంటి రకాలను సైతం మండల వ్యవసాయాధికారి ధృవీకరణతో ఫైన్ వైరటీ కింద కొనుగోలు చేయవచ్చని తెలిపారు. సన్నాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్లు నరేశ్, ఆనంద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు భరత్‌రాజ్ రెడ్డి, మీసాల సుదర్శన్, నాయకులు గొడిశరం భూమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



వడ్లను పరిశీలిస్తున్న డీసీవో శ్రీనివాస్

బోధన్: ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా సహకార అధికారి (డీసీవో) శ్రీనివాస్ అన్నారు. సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, సీఈవో బస్వంత్‌రావులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లి కొనుగోలు ప్రక్రియ పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డీసీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యం డబ్బులు రైతులకు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నామని, ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ కూడా జమ చేస్తున్నామని వెల్లడించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీసీవోను సొసైటీ చైర్మన్, మాజీ చైర్మన్ శివకాంత్ పటేల్, సీఈవోలు సన్మానించారు.

బోరు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్/బోధన్‌టౌన్: పొలాల్లో విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు నాణ్యమైన, ఐఎస్ఐ గుర్తింపు పొందిన పరికరాలు వాడాలని విద్యుత్ శాఖ డీఈ ముక్తార్ సూచించారు. బోరు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ శివారులోని పసుపువాగు సమీపంలో పంటలు సాగుచేస్తున్న రైతులతో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. రైతులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, ప్రతీ రైతు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏవైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమకు సమాచారం అందించాలని సూచించారు. విద్యుత్ శాఖకు ఏడాదికి చెల్లించాల్సిన రూ.360 తప్పనిసరిగా చెల్లించాలని కోరారు. ఇటీవల రాత్రివేళలో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ కాయల్స్‌ను చోరీ చేస్తున్నారని, విద్యుత్‌శాఖ సిబ్బంది ఇప్పటికే రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులు సైతం గస్తీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నగేష్, ఏఈ కృష్ణ, ఫోర్‌మెన్ గంగాధర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు జనార్దన్, సుందర్‌రావు, లైన్‌మెన్‌లు యోగేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

రెండు తలల దూడ జననం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో రెండు తలల దూడ జన్మించి మృతి చెందినట్లు రైతు పుట్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గేదె ఈనగా.. ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో మృతి చెందిందన్నారు. దూడ మృతి చెందిన విషయమై పశువుల ఆస్పత్రి వైద్యులకు సమాచారం అందించినా వారు గేదెను పరిశీలించలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తలల దూడను చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు.

పశుగణనకు సన్నద్ధం

- జిల్లాలో పశుగణన చేపట్టేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- 109 మంది ఎన్యుమరేటర్‌లు, 22 మంది సూపర్‌వైజర్ల నియామకం
- ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న ప్రక్రియ



పశుగణనపై ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్లకు శిక్షణనిస్తున్న అధికారులు (ఫైల్)



పశుగణన చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నాగిరెడ్డిపేట: జిల్లాలో జీవాల లెక్కను తేల్చేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రతి ఐదేళ్లకోకసారి పశుగణన ప్రక్రియ చేపడతారు. గతంలో 2018లో 20వ పశుగణన చేశారు. తిరిగి 2023లో పశుగణన చేపట్టాల్సి ఉండగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికలతో అప్పుడు జరపలేదు. ఈ క్రమంలో ఈ యేడు 21వ అఖిల భారత పశుగణన చేపట్టేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు గణన ప్రక్రియ చేపట్టే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కూడ ఇచ్చారు. కాగా జిల్లాలో గల 485రెవెన్యూ గ్రామాల ఆధారంగా పశుగణన ప్రక్రియ చేపట్టనున్నారు. కామారెడ్డి జిల్లాలో పశుగణన ప్రక్రియ చేపట్టేందుకు 109మంది ఎన్యుమరేటర్‌లతోపాటు 22మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఎన్యుమరేటర్‌గా నియమితులైన వారిలో అటెండర్ స్థాయి నుంచి గోపాలమిత్రలతోపాటు ఇతర సిబ్బంది ఉన్నారు. వీరందరికీ విడతల వారీగా శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పశువుల లెక్కింపు, యాప్ వినియోగంతీరు, సేకరించిన సమాచారం ఆన్‌లైన్‌లో నమోదుచేసే తీరును గురించి శిక్షణలో వారికి వివరించారు.

టీకాలతో ఆగిన ప్రక్రియ

జిల్లాలో పశుగణన ప్రక్రియ నాలుగు నెలలపాటు కొనసాగనుంది. జిల్లాలో అక్టోబర్ 25న పశుగణన ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని పశువులకు గాలికుంటు టీకాలు వేసే క్రమంలో గణన ప్రక్రియకు కొంత అంతరాయం ఏర్పడింది. తిరిగి రెండురోజుల క్రితం పశుగణన ప్రక్రియ మొదలయింది. ఫిబ్రవరి 28వ తేది వరకు జిల్లాలో పశుగణన ప్రక్రియ జరగనున్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు.

డిజిటల్ విధానంలో..

జిల్లాలో చేపట్టిన పశుగణన ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ల ద్వారా గణన ప్రక్రియ చేపట్టనున్నారు. గణనలో భాగంగా సేకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తూ ప్రక్రియను కొనసాగించనున్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన ఒడిశా ప్రజా ప్రతినిధులు



అంకాపూర్‌లో పసుపు పంటను పరిశీలిస్తున్న ఒడిశా ప్రజా ప్రతినిధులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని ఒడిశా రాష్ట్ర సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, మండల స్థాయి అధికారులు శుక్రవారం పరిశీలించారు. అంకాపూర్‌లో అంతర పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులను పరిశీలించారు. అలాగే విత్తన శుద్ధి ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో సమావేశమై అంకాపూర్‌లో వీడీసీ పాత్ర గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో హరికృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి హారిక, కేకే భాజన్న పాల్గొన్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు



బీర్కూర్‌లో నారుమడి

బాన్సువాడ: వానాకాలం పంట పూర్తి కావడంతో యాసంగి సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. కొన్ని చోట్ల నార్లు పోస్తున్నారు. గతేడాది బీర్కూర్ మండలంలో రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టి నిలువున ముంచారు. దీంతో విత్తన ఎంపికలో జా గ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

- రైతులు విత్తన కొనుగోలు సమయంలో ఒప్పంద పత్రాన్ని తీసుకోవాలి.
- విత్తనం తీసుకునేటప్పుడు గుర్తింపున్న కంపెనీయా కాదా చూడాలి.
- ఎక్కువ దిగుబడి వచ్చే విత్తనాన్ని ఎంచుకోవాలి.
- కంపెనీలిచ్చే విత్తన వివరాలు, రశీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి.
- డీలర్లు ఆయా ప్రాంతాలకు అనువైన విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలి.
- విత్తనాలు మొలకెత్తకపోతే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

డిసెంబర్ 18 నుంచి డీఎడ్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: డీఎడ్ మొదటి సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 18 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 18 నుంచి డిసెంబర్ 24 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



రాజు (ఫైల్)

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన మేడుదుల రాజు (35) కలెక్టరేట్‌లోని మైనింగ్ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ నెల 20న విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే అడ్డుగా వచ్చిన పందిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి పడిపోయాడు. ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైద్రాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై బి రాజు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నదిలో దూకి ఆత్మహత్యాయత్నం

నందిపేట్: నందిపేట మండలం ఉమ్మెడ శివారులోని గోదావరి నది బ్రిడ్జిపై నుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి ఆయనను కాపాడారు. వివరాలు.. నందిపేట మండలం చింరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్ము రాములుకు తన సోదరులతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం సాయంత్రం బైక్‌పై ఉమ్మెడ బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. బైక్‌ను ఆపి ఫోన్‌ను అందులో పెట్టి గోదావరిలో దూకాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి అతనిని కాపాడే ప్రయత్నం చేశారు. వరద ఉధృతికి కొట్టుకుపోతూ బ్రిడ్జి కింద పిల్లరును పట్టుకుని ఉన్నాడు. సుమారు గంట తర్వాత స్థానికులు వేసిన తాడును పట్టుకుని బయటకు వచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చేలోపు రాములు నది నుంచి బయటకు వచ్చేశాడు. అయితే ఇటీవల ఉమ్మెడ బ్రిడ్జి వద్ద ఆత్మహత్య ఘటనలు పెరుగుతున్నాయి. దీంతో వంతెనపై పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మహమ్మద్ నగర్‌కు చెందిన కుర్మ మల్లయ్య తన ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

చెల్లిపై అత్యాచారం

ఖలీల్‌వాడి: నగరంలో ఓ యువకుడు సొంత చెల్లిపై అత్యాచారం చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు భరోసా

- గల్ఫ్ మృతుల కుటుంబాల ఖాతాల్లో రూ.ఐదు లక్షలు జమ చేస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 37 కుటుంబాలకు రూ.1.85 కోట్లు

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు భరోసా లభించింది. 2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటి వరకు మరణించిన మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షల చొప్పున జమ చేస్తుంది. రెండు నెలల కింద గల్ఫ్ మృతులకు సాయం ప్రకటించి నెల రోజుల కిందనే నిధులను విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సాయం కార్యక్రమాన్ని ప్రారంభించిన తరువాత లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పరిహారం జమ చేయడంలో జాప్యం జరిగింది. వేములవాడలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ మృతుల కుటుంబాలకు సాయం అందించే కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలోని 37 కుటుంబాలకు రూ.1.85 కోట్ల సాయంను జమ చేయడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ ఆమోదంతోనే గల్ఫ్ మృతుల కుటుంబాలకు సాయం మంజూరు అవుతుంది. జిల్లాలో తొలి విడతలో 35 కుటుంబాలకు పరిహారానికి సంబంధించిన ప్రొసిడింగ్‌లను అందించారు. బుధవారం మరో రూ.10లక్షలను విడుదల చేయగా ఇటీవల మరణించిన ఇద్దరు మృతుల కుటుంబాలకు సాయం అందనుంది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గల్ఫ్‌లో మరణించిన వారి కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం అందించారు. వైఎస్ మరణం తర్వాత గల్ఫ్ ప్రవాసుల సంక్షేమంపై ఎవరు దృష్టి పెట్టలేదు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సాయం మంజూరు చేస్తోంది. ఇది ఇలా ఉండగా గల్ఫ్ మృతుల కుటుంబాలకు సాయం అందించే విషయంలో కటాఫ్ తేదిని సవరించాలనే డిమాండ్ వినిపిస్తుంది. 2023 డిసెంబర్ 7 తర్వాత గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకే సాయం అందించడంతో గతంలో మరణించిన వారి కుటుంబాలు నష్టపోతున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మరణించిన వారి కుటుంబాలకు కూడా సాయం అందించడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎంతోమందికి ప్రయోజనం



గల్ఫ్‌లో మృతి చెందిన వారి కుటుంబాలకు సాయం అందించడంతో ఎంతో మందికి ప్రయోజనం కలుగుతుంది. రూ.ఐదు లక్షల సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గల్ఫ్ బాధిత కుటుంబాలు రుణ పడి ఉంటాయి.

– తక్కూరి సతీష్, కాంగ్రెస్ నాయకుడు, మోర్తాడ్